ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జనగామ
ఆదివారం 3 మార్చి 2024



ఆరు జిల్లాలకు లేని పూర్తిస్థాయి డీఈవోలు

అందరూ ఇన్‌చార్జ్‌లే..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో విద్యా శాఖ పరిస్థితి అత్యంత అధ్వాన్నంగా ఉంది. అస్తవ్యస్థ పరిస్థితి నెలకొన్నది. విద్యార్థులను విద్యావంతులుగా, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత కలిగిన విద్యాశాఖకే దిక్కులేని పరిస్థితి. చాలా ఏళ్లుగా రెగ్యులర్ అధికారులు లేక ఇన్‌చార్జిలతోనే కూనారిల్లుతున్న ఈ శాఖలో పరిపాలన కొరవడి, పర్యవేక్షణ కుంటుపడి పూర్తిగా గాడి తప్పింది. ఏం జరుగుతున్నదో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఏ ప్రభుత్వ శాఖలోనైనా కీలక పదవుల్లో ఒకరిద్దరు ఇన్‌చార్జిలు ఉంటారు. అదేమిటోగానీ.. విద్యాశాఖలో మాత్రం అంతాఇన్‌చార్జిలే రాజ్యమేలుతున్నారు. పైగా ఒక్కొక్కరికి రెండు మూడు బాధ్యతలు ఉన్నాయి. వీరంతా అసలు ఉద్యోగం వదిలేసి కొసరు కొలువుల్లో కొనసాగుతున్నారు. ఫలితంగా విద్యాప్రమాణాలు పడిపోతున్నాయి. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం అంతకంతకూ పడిపోతోంది. గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో చదువులు సట్టుబండలయ్యాయి. బళ్లు కడకండ్ల పాలయ్యాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో విద్యా శాఖ దుస్థితిపై ప్రత్యేక కథనం..

- డిప్యూటీ డీఈవోలు అసలే లేరు
- రెగ్యులర్ ఎంఈవో ఒక్కరే..
- అన్ని మండలాలకు ఇన్‌చార్జ్‌లే దిక్కు
- 70 శాతం స్కూళ్ల హెచ్‌ఎంలూ వారే
- ఉమ్మడి జిల్లాలో 2,500 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ
- కుంటుపడుతున్న చదువులు.. గాడితప్పిన విద్యాశాఖ

హనుమకొండ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖ ఇన్‌చార్జ్‌ల పాలనలోనే కొనసాగుతోంది. డీఈవోలు, ఎంఈవోలు, ఆఖరికి హెచ్‌ఎంలు కూడా ఇన్‌చార్జ్‌లే ఉన్నారు. డిప్యూటీ డీఈవోలు అసలే లేరు. డైట్ కాలేజీకి కూడా పూర్తికాలపు ప్రిన్సిపాల్ లేడు. బీఈడీ కాలేజీకి ప్రిన్సిపాల్ ఉన్నా ఆయనకు అదనపు బాధ్యతను అంటగట్టారు. దీనితో ఉన్నవారిపై అదనపు పనిభారం పడి పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. దీనితో ప్రభుత్వపాఠశాలల్లో ఉపాధ్యాయులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. చదువులు చెప్పే గురువులు లేక విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోగా సర్కార్ బళ్లు క్రమంగా మూతపడుతున్నాయి.

ఉపాధ్యాయుల కొరత

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2500 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 5.50లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 90 శాతం పాఠశాలలకు రెగ్యులర్ హెడ్ మాస్టర్లు లేరు. పాఠశాలల్లో పని చేసే సీనియర్ అధ్యాపకులకే హెడ్‌మాస్టర్‌గా ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించారు. దీనితో వారు ఎప్పు డు వస్తారో ? ఎప్పుడు పోతారో తెలియని పరిస్థితి. మరో వైపు ఉమ్మడి జిల్లాలోని సర్కార్ బళ్లను ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. 2500లకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉపాధ్యాయుల నియామకానికి పదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం డీఎస్‌సీని నిర్వహించ లేదు. ఇటీవల డీఎస్‌సీ నిర్వహణకు నోటిఫికేషన్ జారీ చేసినా అందులో ఉమ్మడి జిల్లాలో చూపిన టీచర్ పోస్టులు 560 మాత్రమే. టీఎస్‌పిఎస్‌సీ పరీక్షా పత్రాల లీకేజీతో ఈ నియామక ప్రక్రియ కూడా అటకెక్కింది. గత అనేక సంవత్సరాలుగా ఉపాధ్యాయులక పదోన్న తులు లేవు. ఉమ్మడి జిల్లాలో విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం తగ్గుతుండడానికి, సర్కార్ బళ్ల మూతబడానికి ఇది కారణమౌతోంది.

డిప్యూటీ డీవోలు లేరు..

డీఈవోలుసరే ఎలాగూ లేరు. కనీసం డిప్యూటీ డీఈవోలు అయిన ఉన్నారా.. అంటే ఒక్కరు కూడా లేరు. ఉన్న ఒక్క డిప్యూటీ డీఈవో వాసంతికి డీఈవోగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతో ఉమ్మడి జిల్లాలో ఒక్కరు కూడా లేకుండాపోయారు. ఇదివరకు వరంగల్, జనగామ, మహబూబాద్ డివిజన్లలకు ఒక్కొక్కరు చొప్పున డిప్యూటీ డీఈవోలు ఉండేవారు. వారంతా రిటైర్ అయ్యారు. వారి స్థానంలో కొత్తవారేవరూ రాలేదు. ఆ పోస్టులన్నీ అలాగే ఖాళీగా ఉండిపోయాయి.

ఒకే ఒక్క ఎంఈవో

ఉమ్మడి జిల్లా పరిధిలో 75 మండలాలుండగా మండలానికో విద్యాశాఖాధికారి (ఎంఈవో) విధిగా ఉండాలి. కానీ ప్రస్తుతం ఒకే ఒక్క ఎంఈవో

మిగతా 7వ పేజీలో..

ఇన్‌చార్జ్ డీఈవోలు

- హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు రెగ్యులర్ జిల్లా విద్యాశాఖాధికారులు (డీఈవో)లు చాలా కాలం నుంచి లేరు.
- హనుమకొండ జిల్లాకు ప్రస్తుతం డీఈవో ఉన్న అబ్దుల్‌హై ఇన్‌చార్జే. వాస్తవంగా ఆయన బీఈడీ కాలేజీలో లెక్చరర్. ఆ కాలేజీకి ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. దీనితో పాటు ఆయనకు డీఈవో బాధ్యతలను కూడా అప్పగించారు.
- వరంగల్ జిల్లాకు కూడా రెగ్యులర్ డీఈవో లేడు. ఇన్‌చార్జ్ డీఈవోతోనే నాలుగేళ్లుగా నెట్టుకువస్తున్నారు. ఆరు జిల్లాల్లో ఒకే ఒక్క డిప్యూటీ డీఈవోగా ఉన్న వాసంతిని వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ డీఈవోగా కొనసాగుతున్నారు.
- జనగామ డీఈవో రాము ఇన్‌చార్జే. ఆయన రెగ్యులర్ పోస్టు విద్యాశాఖ (హైదరాబాద్)లో అడిషనల్ డైరెక్టర్. రెండేళ్ల కిందట జనగామ డీఈవోగా కూడా అదనపు బాధ్యతలు అంటగట్టారు. దీంతో ఆయన జోడుగుర్రాల స్వారీ చేస్తున్నారు. ఇక్కడ ఒక రోజు, అక్కడ ఒక రోజు విధులు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌కే ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారు.
- మహబూబాబాద్ జిల్లాకు కూడా ఇన్‌చార్జ్ డీఈవోనే. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అదనపు డైరెక్టర్ అయిన రామారావుకు ఇక్కడ ఇన్‌చార్జ్ డీఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఏడాదిగా ఆయన అక్కడా.. ఇక్కడా రెండు పడవలపై కాళ్లపెట్టి ఏదో విధంగా నెట్టుకువస్తున్నారు.
- ములుగు జిల్లాకు కూడా ఇన్‌చార్జ్ డీఈవోనే దిక్కయ్యారు. మంచిర్యాల జిల్లాలో ఏడీగా పనిచేస్తున్న పాణికి ఇక్కడ విద్యాశాఖ బాధ్యతలు అప్పగించారు.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు కూడా ఇన్‌చార్జ్ డీఈవోనే కొనసాగుతున్నారు. అడిషనల్ డైరెక్టర్ అయిన రాంకుమార్ ఈ అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెదలాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్

జనగామ టౌన్, మార్చి 2: ఖైదీలు సత్ప్రవర్తనతో మెదగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ సూచించారు. శనివారం ఆయన జిల్లాకేంద్రంలో సబ్‌జైలును సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించారు. క్షణికావేశంలో తప్పులు చేసి శిక్షార్హులు కావొద్దన్నారు. జైలు నుంచి విడుదలయ్యాక నేరాలకు దూరంగా ఉంటూ మంచి మార్గంలో వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ కృష్ణకాంత్, లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ ఎం.రవీంద్ర, అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ జ్యోత్స్న, శ్రీహరి పాల్గొన్నారు.

గ్రూప్స్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ టౌన్, మార్చి 2: గ్రూప్ 1, 2, 3, 4 పరీక్షలకు ప్రిపేరయ్యే బీసీ అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ హనుమకొండ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ అభివృద్ధి అధికారి బి.రవీందర్ ప్రకటించారు. ఇందుకోసం జనగామ జిల్లాకు చెందిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రు ల వార్షిక ఆదాయం రూ.5 లక్షల లోపు ఉన్నవారు అర్హులని తెలిపారు. ఈ నెల 8 నుంచి 20 లోపు తమ పేర్లను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎస్‌బీసీస్టడీసర్కిల్.సీజీజీ.గావ్.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 0870-2571192, 040-24071178, 040-27077929 నంబర్లకు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

నేటి నుంచి ప్రైవేటు బస్సు డ్రైవర్ల సమ్మె

జనగామ టౌన్, మార్చి 2: వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 3 నుంచి ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లు, క్లీనర్లు సమ్మె చేస్తున్నట్లు హైర్ బస్ డ్రైవర్స్, క్లీనర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు ప్రకటించారు. శనివారం జనగామలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా డ్రైవర్లకు నెలకు రూ.22 వేల నుంచి రూ.24 వేల వరకు వేతనాలు చెల్లించాలని, సంవత్సరానికి రెండు జతల యూనిఫామ్ అందించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బోనగిరి భిక్షపతి, మడికంటి రాజు, దామెర వెంకటేశ్వర్లు, బాల్నే రమేశ్, జొన్న వెంకటరెడ్డి, చేవెల్లి కొమురయ్య, వడ్లకొండ సురేశ్, చెవుల రాజు, బోడ రాజు, భాస్కర్, బాలరాజు, అనిల్‌కుమార్, రామ్‌దయాకర్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల ఆరాధ్యుడు సేవాలాల్

జయంతి వేడుకల్లో ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్



పాలకుర్తిలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

పాలకుర్తి, మార్చి 2: గిరిజనుల ఆరాధ్యుడు, గొప్ప యోగి సేవాలాల్ మహారాజ్ అని ప్రభుత్వ విప్ రాంచంద్రు నాయక్ కొనియాడారు. సేవాలాల్ జయంతి సందర్భంగా శనివారం పాలకుర్తిలో భోగ్ బండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి రాంచంద్రునాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజనులు సంప్రదాయ నృత్యాలు చేశారు. అనంతరం విప్ మాట్లాడుతూ పూర్వకాలంలోనే సేవాలాల్ సామాజిక సమతుల్యతలను పాటించారని అన్నారు. కులమతాలను పక్కనపెట్టి మనమంతా ఒక్కటే అన్న భావజాలాన్ని వెలుగెత్తి చాటారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమ కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేస్తారని స్పష్టం చేశారు. ఇప్పటికే మహాలక్ష్మి, రూ.500లకే వంటగ్యాస్, గృహజ్యోతి పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు.

ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పాలకుర్తిలో సేవాలాల్ గుడి నిర్మాణానికి శ్రీకారం చుట్టారని, వేసిన పిల్లర్లను కొంత మంది తీసుకెళ్లారని ఆరోపించారు. వచ్చే ఏడాదిలోగా సేవాలాల్ గుడి నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేయడంలో ప్రత్యేక చొరవ చూపుతానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ వచ్చే పార్లమెంటు, స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలను గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీసీఈవో అనిల్‌కుమార్, నాయకులు జాటోతు నెహ్రూనాయక్, బ్లాక్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, హమ్యానాయక్, సురేష్‌నాయక్, కృష్ణమూర్తి, భాస్కర్, సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నీళ్లు లేక నెర్రెలు..



సీతారాంపురంలో ఎండిపోతున్న వరిపంట

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- వట్టిపోతున్న బోరుబావులు
- పొట్టదశలో ఎండిపోతున్న వరి
- ఆందోళనలో అన్నదాతలు
- గోదావరి జలాలు అందించాలని విన్నపం

దేవరుప్పుల, మార్చి 2: దేవరుప్పుల మండలంలో కరువుఛాయలు అలుముకున్నాయి. మండలంలోని అనేక గ్రామాలకు యశ్వంతాపూర్ వాగు ఆనుకొని ఉండటం వల్ల ఆయా గ్రామాల రైతులు యేటా 80శాతం బోరు బావుల ఆధారంగా, మిగతా వారు చెరువులు, కుంటల ఆధారంగా వరి పంట సాగు చేస్తారు. 2022లో వానాకాలం 15,440ఎకరాలు, యాసంగిలో 10,475ఎకరాలు; 2023 వానాకాలంలో 16,240, యాసంగిలో 14025ఎకరాలు; 2024 వానాకాలంలో 17,970 సాగు చేయగా, ఈ యాసంగిలో 11,605ఎకరాల్లో బోరుబావుల ఆధారంగా వరిపంటను సాగుచేశారు. ప్రస్తుతం వరి పొట్ట దశకు చేరుకుంది. భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లు వట్టిపోతున్నాయి. బోర్లు ఆగి ఆగి కొద్దిపాటి నీరు పోస్తుండటంతో నీరు అందక ఎండిపోతు న్నాయి. దీంతో పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చేలా లేవని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం కాళేశ్వరం ఎత్తి పోతల పథకం ద్వారా గోదావరి జలాలతో చెరువులు, కుంటలు, వాగుల్లోని చెక్‌డ్యాంలు నింపితే తప్ప భూగర్భ జలాలు పెరిగి పంట చేతికి వచ్చే అవకాశం ఉంది.

బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం పూర్తి చేశాక, దేవాదుల, గోదావరి జలాల ద్వారా స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్‌తో పాటు నవాబుపేట రిజర్వాయర్ ద్వారా పీక్‌స్టేజీలో చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలను నింపి రైతులను ఆదుకున్నారు. దీంతో వరి పంటకు ఢోకా లేకుండా ఉండేది. అదే ఆలోచనతో ఈ యాసంగిలో రైతులు 11,605 ఎకరాల్లో వరిపంటను సాగు చేశారు. ప్రస్తుతం బోరు బావుల్లో వచ్చే కొద్దిపాటి నీరు సరిపోక పొలాలు నెర్రెలు బారుతున్నాయి. ఎకరా వరి పంటకు వేలల్లో పెట్టుబడి పెట్టి సాగు చేస్తే కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు కంటతడి పెడుతున్నారు. ప్రభుత్వం రైతుల పట్ల చిత్తశుద్ధితో ఆలోచించి వరిపంట ఎండిపోకుండా ఉండేందుకు వెంటనే గోదావరి జలాలు వదిలి చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలను నింపాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎకరాకు రూ.25వేల చొప్పున పెట్టుబడి పెట్టా..

- బస్వ వెంకన్న, రైతు, సీతారాంపురం



నాకున్న నాలుగెకరాలకు తోడు మరో 16 ఎకరాలు కౌలుకు తీసుకొని మొత్తం 20 ఎకరాల్లో వరిపంట సాగు చేశా. ఎకరాకు రూ.25వేల చొప్పున మొత్తం రూ.5 లక్షల పెట్టుబడి ఖర్చు అయింది. ప్రస్తుతం బోర్లు వట్టిపోయి 8ఎకరాల వరిపంట మొత్తం ఎండిపోయింది. మిగతా వరి పొట్ట దశలో ఉంది. పంట చేతికొచ్చేలోపు ఇంకా ఎన్ని ఎకరాలు ఎండిపోతుందో తెలియడం లేదు.

గోదావరి నీళ్లు వదిలి ఆదుకోవాలి..

- బాషిపాక రాములు, రైతు, సీతారాంపురం



ఇప్పటికే చాలా వరిపంట ఎండిపోయింది. నెలక్రితమే నీరు వదిలితే 100శాతం పంట చేతికి అందేది. ఇప్పుడు వదిలినా కూడా 50శాతం పంట అయినా దక్కుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నవాబుపేట, స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్ల ద్వారా గోదావరి, దేవాదుల నీటితో చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలను నింపి రైతులను ఆదుకోవాలి.

ఎమ్మెల్యే చొరవ చూపాలి..


-సింగారపు రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు, జనగామ.



భూగర్భ జలాలు అడుగంటి రైతుల బోర్లు వట్టిపోతున్నాయి. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి వెంటనే స్పందించి యాసంగి వరిపంటను కాపాడాలి. గోదావరి, దేవాదుల ద్వారా నీరును వదిలి ఈ ప్రాంత రైతాంగాన్ని ఆదుకోవాలి. ఇప్పటికే ఎండిపోయిన పంటను అధికారులు అంచనా వేసి నష్టపరిహారం అందించాలి. ఈ విషయంలో ఎమ్మెల్యే దృష్టి సారించాలి.



సీతారాంపురంలో ఎండిపోయిన కొండాయి చెరువు



చుక్క నీరు లేకుండా ఎండిపోయిన చెక్ డ్యాం

యూబీఐ రిటేల్ - ఎక్స్‌పో ప్రారంభం


మాట్లాడుతున్న, పాలగుల సత్యం

వడ్డెపల్లి, మార్చి 2: హనుమకొండ బాలసముద్రంలోని హయగ్రీవాచారి (కుడా) గ్రౌండ్‌లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ)వరంగల్ రీజియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రిటేల్ - ఎక్స్‌పోను యూబీఐ రీజినల్ హెడ్ పాలగుల సత్యం శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకింగ్ రంగంలో అతి తక్కువ వడ్డీతో గృహ, వాహన, విద్యా రుణాలను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో 14పైగా కార్లకు సంబంధించిన కంపెనీలు, 30కి పైగా బిల్డర్లు, సోలార్‌కు సంబంధించిన సప్లయర్లు పాల్గొన్నారు. రుణాలు పొందిన వారికి పాలగుల సత్యం మంజూరు పత్రాలను అందజేశారు. యూబీఐ అధికారులు నాంపెల్లి శ్రీనివాస్, రంగయ్యనాయుడు, సర్వేష్‌నాగార్జు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ రూరల్, మార్చి 2: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే గ్రూప్- 1 పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎంపివి.ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7వ తేదీలోగా తమ దరఖాస్తులను హనుమకొండ లష్కర్ బజార్‌లోని స్టడీ సర్కిల్ నేరుగా అందజేయాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 0870-2571192, 040-24071178, 040-27077929లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఉపాధి కార్యాలయంలో 6న జాబ్ మేళా

హనుమకొండ రూరల్, మార్చి 2: ఈ నెల 6వ తేదీన హనుమకొండ ములుగురోడ్‌లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.మల్లయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గూగుల్ పే, వరంగల్ హనుమకొండ కంపెనీలో 40 ఉద్యోగాల ఎంపికకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ చదివిన 18 నుంచి 25 యేళ్ల వయస్సుగల నిరుద్యోగ యువకులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో ఉపాధి కల్పన కార్యాలయానికి ఉదయం 11గంటల వరకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 98488 95937 సంప్రదించాలని తెలిపారు.



జాతీయ స్థాయి టెన్నిస్ క్రీడా పోటీల ప్రారంభ సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ రామన్

సందడిగా జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు

10 రాష్ట్రాల నుంచి 200 క్రీడాకారులు హాజరు

ఈనెల 8 వరకు పండుగ వాతావరణంలో క్రీడలు

హనుమకొండ స్పోర్ట్స్, మార్చి 2: ఆల్ ఇండియా టెన్నిస్ అసోసియేషన్ ఆదేశాల మేరకు వరంగల్ ఉమ్మడి జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఓపెన్ టూ ఆల్ మెన్ టెన్నిస్ టోర్నమెంట్ సందడిగా ప్రారంభమయ్యాయి. హనుమకొండ సుబేదారిలో వరంగల్ ఆఫీసర్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు శనివారం తెలంగాణ రాష్ట్ర టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఆర్ రామన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు స్నేహపూర్వక సంబంధాలు పెంపొందిస్తాయన్నారు. హనుమకొండ వేదికగా జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు నిర్వహించడం అభినందనీయన్నారు.

వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ కోశాధికారి, క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి ఎం.రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. ఓపెన్ టూ ఆల్ మెన్ విభాగంలో నిర్వహించనున్న టెన్నిస్ పోటీల్లో 10 రాష్ట్రాల నుంచి 70 సింగిల్స్ జట్లు, 33 డబుల్స్ విభాగాల్లో క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. సింగిల్స్, డబుల్స్ విభాగంలో ఈనెల 8 వరకు నాకౌట్ పద్ధతిన పోటీలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ విభాగాల్లో గెలిచిన క్రీడాకారులకు రూ.లక్ష పారితోషికాన్ని అందించనున్నట్లు తెలిపారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులకు భోజన, వసతి సౌకర్యాలను కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఆఫీసర్స్ క్లబ్ అధ్యక్షుడు ప్రభాకర్‌రావు, కార్యదర్శి ఏపీ ఎలమురుగు, వైస్ ప్రసిడెంట్ సత్యనారాయణరెడ్డి, వరంగల్ ఆఫీసర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి రవిందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి కన్నారెడ్డితో పాటు కోచ్‌లు, టెక్నికల్ అఫీషియల్స్ తదితరులు పాల్గొన్నారు.

ఇంతింతై.. కళలకు సొంతమై!

● స్వర్ణోత్సవ సంబరాలకు భారతీయ నాటక కళా సమితి సిద్ధం ● నేటినుంచి 8 తేదీ వరకు ఉభయ రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు

వర్ధన్నపేట, మార్చి 2: భారతీయ నాటక కళా సమితిలో స్వర్ణోత్సవ సందడి నెలకొంది. శివరాత్రి పండుగను పురస్కరించుకుని ఐదు రోజుల పాటు జరిగే కార్యక్రమాలు ప్రజలకు ఎంతో అలరించనున్నాయి. నాటి కళలకు వేదికగా వర్ధన్నపేట భారతీయ నాటక కళాసమితి నిలువగా, అర్ధ శతాబ్దంలోకి అడుగు పెట్టడం కళాసమితి సభ్యులకు ఆనందాన్ని తెస్తోంది. నిర్వాహకుల అంకిత భావం, కళల పట్ల వారికి ఉన్న ఆరాధనతో భారతీయ నాటక కళా సమితి కళాభిమానుల మనసులను దోచుకుంటోంది. ఒకే మాట, ఒకే బాటగా భారతీయ నాటక కళా సమితి 49 వసంతాలు పూర్తి చేసుకోనుంది. రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొంది నాటక రంగానికి చేస్తున్న సేవలతో అందరి అభిమానాలు చూరగొంటోంది. 1974లో వర్ధన్నపేట మండలం ఇల్లందలో దివంగత ఈగ శ్రీహరి, వడ్లకొండ వెంకటయ్య, వేముల ఆంజనేయులు, మల్లూరి రంగయ్య, పోశాల సూర్యనారాయణ, దివంగత సిరిపోలు వెంకట్రామారావు, వనం లక్ష్మీకాంతరావు, వడ్లకొండ ఎల్లగౌడ్ తదితరులు భారతీయ నాటక కళాసమితికి బీజం వేశారు.

అల్లూరి స్ఫూర్తితో..

1980లో వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద నుంచి ఆనాటి తాలుకా కేంద్రమైన వర్ధన్నపేటకు మారింది. ప్రారంభంలో అనేక ఒడిదుడుకులకు లోనైనా కమిటీ సభ్యులు లక్ష్యసాధనే ధ్యేయంగా భావించి అప్పట్లో నిర్దిష్టమైన స్థలం, ప్రత్యేక వేదికంటూ లేకపోవడంతో నాటిక పోటీలకు తీవ్ర అవరోధాలు ఏర్పడేవి. ఈ ఇబ్బందులను శాశ్వతంగా అధిగమించాలనే ధృఢ సంకల్పం వారిలో పెరిగింది. వడ్లకొండ ఎల్లగౌడ్ దర్శకత్వంలో స్థానిక కళాకారులతో అల్లూరి సీతారామ రాజు నాటికను ప్రదర్శించి దాతల ద్వారా విరాళాలు సేకరించారు. అలా అల్లూరి సీతారామరాజు నాటక ప్రదర్శనతో సేకరించిన డబ్బుతో స్థల సేకరణ చేయాలనే ఆలోచన కలిగింది.

ఐదు రోజుల పాటు..

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే నాటక పోటీలు పట్టణంలో ఐదు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ నెల 3 నుంచి 8వ తేదీ వరకు నాటక పోటీల షెడ్యూల్‌ను ప్రకటించగా, ఐదు రోజులు పూర్తి నాటికలు వేసి, శివరాత్రిన ఇతర కార్యక్రమాలు, బహుమతుల ప్రదానం చేస్తారు. 3న మొదటి ప్రదర్శన తెలుగు కళాసమితి, విశాఖపట్నం వారి ఆధ్వర్యంలో నిశ్శబ్దమా.. నీ ఖరీదెంత, కళానికేతన్, వీరన్నపాలెం వారి ఆధ్వర్యంలో రాజుగారి గోచి, 4న కళాంజలి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో రైలే రాజు, చైతన్య కళాభారతి కరీంనగర్ వారి ఆధ్వర్యంలో స్వప్నం రాల్చిన అమృతం, 5న సిరిసిరిమువ్వ కల్చరల్ అసోయేషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో హక్కు, మురళీ కళానిలయం హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో అవ్వా అప్పచ్చి, 6న గోవాడ క్రియేషన్స్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో మూల్యం, మైత్రి కళానిలయం విజయవాడ వారి ఆధ్వర్యంలో బంధం, 7న అభినయ ఆర్ట్స్ గుంటూరి వారి ఆధ్వర్యంలో ఇంద్రప్రస్థం, శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరి వారి ఆధ్వర్యంలో కౌసల్యా సుప్రజా రామా, 8న శివ రాత్రి పండుగ సందర్భంగా పలు కల్చరల్ ప్రోగ్రామ్స్, విజేతలకు బహుమతుల ప్రదానం చేస్తారు.

కలగానే జాతీయస్థాయి పోటీలు

గతంలో నాటిక కళా సమితి కమిటీ సభ్యులు ఎంతో కృషిచేసి నాటకాలను రాష్ట్రస్థాయికి చేరేలా కృషిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కళాకారులతో పాటు తమిళనాడు, చెన్నై రాష్ట్రాలకు చెందిన కళాకారులను తీసుకువచ్చి నాటికలు ప్రదర్శింప చేశారు. సినీ రంగంలో మంచి స్థానాల్లో ఉన్న క్యారెక్టర్ ఆర్టిస్టులను సైతం తీసుకువచ్చారు. కానీ, ప్రస్తుతం హైదరాబాద్ నుంచి మాత్రమే ఎక్కువ శాతం నాటికలు ప్రదర్శించే వారు వస్తున్నారు. దీంతో భారతీయ నాటిక పోటీలు ఇంకా రాష్ట్రస్థాయిలో ఉండిపోయాయి. ఇక జాతీయస్థాయిలో పోటీలు కలగానే మిగిలిపోయే అవకాశాలు ఉన్నాయా అంటూ ప్రేక్షకులు చర్చించుకుంటున్నారు. దీనికి గతంలో విమర్శలు రావడంతో ఇప్పటి ఆహ్వాన పత్రికలో ఉభయ తెలుగు రాష్ట్రాలస్థాయి పోటీలని ముద్రించి చేతులు దులుపుకున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సైతం కళా సమితి ముందుకు వెళ్తే ఆదరణ బాగుంటుందని సూచిస్తున్నారు.

కమిటీలో సమన్వయ లోపం

భారతీయ నాటిక కళా సమితి కమిటీ సభ్యుల మధ్య సమన్వయం లోపించింది. గత నెల రోజుల నుంచి కార్యక్రమాలపై సమావేశాలు ఏర్పాటు చేసుకున్నప్పటికీ దాతలకు, ప్రజా ప్రతినిధులకు ఆహ్వాన పత్రికలు అందించడంలో విఫలమయ్యారు. ఈ నెల 3వ తేది నుంచి కార్యక్రమాలు ప్రారంభమవుతుండగా, రాత్రి వరకు ఆహ్వాన పత్రికలు పంచుతునే ఉండడం పట్ల విమర్శలకు గురవుతున్నారు. ఆహ్వాన పత్రికలో పలువురి పేర్లను సైతం తప్పుగా ముద్రించడం పట్ల దాతలు అసహనానికి గురయ్యారు. ఇక ఈ సారి భారీగానే విరాళాలు వసూలు చేసినట్లు తెలుస్తోంది?. మూలధన ఏర్పాటులో భాగంగా దాదాపు రూ.25 లక్షల వరకు కొత్తగా విరాళాలు సేకరించగా, ఆహ్వాన పత్రిక అడ్వటైజ్‌మెంట్ల ద్వారా రూ.3లక్షల వరకు సేకరించారు. గతేడాది కమిటీ సభ్యుల మధ్య విరాళాల సేకరణ, ఖర్చుల పద్దుల్లో కొంత పంచాయతీ ఏర్పడగా అంతర్గతంగా పరిష్కరించుకున్నారు. గతేడాది కార్యక్రమాల్లో స్టేజీ మీదకు పిలిచే సందర్భంలోనూ అతిథులు కమిటీ సభ్యులకు చివాట్లు పెట్టారు. మళ్లీ ఇవన్నీ పునరావృతం కాకుండా సభ్యులు చూసుకుంటూ సమన్వయంగా పని చేయాలని ప్రేక్షకులు ఆశిస్తున్నారు.



వర్ధన్నపేటలో భారతీయ నాటక కళాసమితి ఆడిటోరియంలో సాగుతున్న పనులు

పార్కింగ్‌కు అడ్డాగా కళా సమితి ప్రాంగణం

గతంలో శివరాత్రి సందర్భంగా నాటికల కోసం ఆడిటోరియాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ప్రభుత్వ నిధులతో సైతం భారీగా షెడ్డు వేసి పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఫంక్షన్లు చేసుకునేందుకు మినీ ఫంక్షన్ హాల్‌గా వినియోగిస్తామని తెలిపారు. కార్యక్రమాలు ముగియగానే ఎక్కడి వారు అక్కడికి వెళ్లిపోవడంతో కళా ప్రాంగణం అసాంఘిక శక్తులకు అడ్డాగా మారుతోంది. దీనికి తోడు పక్కనే సినియా థియేటర్ ఉండడంతో ఎంచక్కా ఆ యాజమాన్యం సినిమాలకు వచ్చే ప్రేక్షకుల వాహనాలు ప్రాంగణంలో ఉంచి పార్కింగ్ ఫీజులను వసూలు చేసుకుంటున్నారు. ఇవన్నీ స్థానికంగా ఉన్న కమిటీ సభ్యులకు తెలిసినప్పటికీ వాటిపై దృష్టి సారించడంలేదు. నాటిక పోటీలు జరిగినప్పుడు ఊకదంపుడు ఉపన్యాస్యాలు ఇస్తున్న కమిటీ సభ్యులు కళలను ఆదరిస్తున్న ప్రజలకు పరోక్షంగా కళా ప్రాంగణం సహాయ పడే విధంగా చేయాలని కోరుతున్నారు.

నాటి కళలను కాపాడుకుంటాం : పెద్దూరి సంజీవరావు, కల్చరర్ సెక్రటరీ

నాటి కళలను కాపాడుకోవాలనే లక్ష్యంతో భారతీయ నాటకాలను క్రమం తప్పకుండా చేస్తున్నాం. దివంగత ఈగ శ్రీహరి ఆశయాలను కొనసాగించడంతో పాటు కళాసమితిని స్థాపించిన ప్రతీ ఒక్కరి నిబద్ధతను ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్తున్నాం. కమిటీ సహాయ సహకారాలు, ప్రజల పూర్తి సహకారం, ప్రజా ప్రతినిధుల ప్రోత్సాహంతో మరింత విజయవంతంగా నాటిక ప్రదర్శనలు పూర్తి చేస్తాం.

అందరూ ఇన్‌చార్జ్‌లే..

(5వ పేజీ తరువాయి)

ఉన్నారు. ఆయన హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలంలో పని చేస్తున్న రవీందర్. మిగతా మండలాల్లో సుదీర్ఘంగా సీనియర్ హెడ్‌మాస్టర్లే ఇన్‌చార్జ్‌లుగా కొనసాగుతున్నారు. సీనియర్ హెడ్‌మాస్టర్లకే ఈ బాధ్యతలు అప్పగించారు. వారు తమ రెగ్యులర్ హెచ్‌ఎం బాధ్యతలు చూసుకుంటూనే ఇటు ఎంఈవో విధులను కూడా నిర్వహించడానికి సతమతమవుతున్నారు. ఈ క్రమంలో దేనికీ న్యాయం చేయలేకపోతున్నారు. గతంలో ప్రతీ మండలానికి ఒక ఎంఈవో ఉండేవారు. అనేక మంది రిటైర్ కావడం, కొందరు మృతి చెందడం, ఎంఈవోలుగా పదోన్నతులు లేకపోవడం, కొత్త నియామకాలు చేపట్టకపోవడం తదితర కారణాల వల్ల అసలు ఎంఈవోలే లేకుండా పోయారు. మండల పరిధిలోని ప్రభుత్వ యాజమాన్యంలోని పాఠశాలలను సమర్థవంతంగా నిర్వహించడంలో ఎంజీవోలదే కీలక భూమిక. పూర్తికాలపు ఎంఈవోలే లేకపోవడంతో సర్కార్ బళ్ల తీరు రాజు లేని రాజ్యం అయింది.

హెడ్‌మాస్టర్లు

ఏ పాఠశాల అయినా సక్రమంగా నడవాలన్నా, విద్యార్థుల చదువులు సక్కగా సాగాలన్నా, మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నా హెడ్‌మాస్టర్లే కీలకం. ఉపాధ్యాయులను నియంత్రణలో పెట్టి విద్యాబోధన సరిగా జరిగేట్టు చూసే బాధ్యత హెచ్‌ఎంలది. అటువంటి వారే ఇన్‌చార్జిలుగా ఉంటే ఇక బడులు నడిచేదెలా? సదువులు సాగెదెలా? అని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

ప్రిన్సిపాళ్లూ ఇన్‌చార్జిలే..

ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చే బీఈడీ, డైట్ కళాశాలలకు సైతం పూర్తి కాలపు ప్రిన్సిపాళ్లు లేరు. హనుమకొండలోని డైట్ కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా నారాయణరెడ్డి ఉన్నారు. ఆయనకు యాదాద్రి జిల్లా ఇన్‌చార్జి డీఈవోగా కూడా అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. రెండు బాధ్యతలను ఆయన చూసుకోలేక సతమతమవుతున్నారు. ఇక్కడ కొద్ది రోజులు, అక్కడ కొద్ది రోజులు విధులు నిర్వహిస్తూ ఏదో విధంగా నెట్టుకువస్తున్నారు. హనుమకొండలోని బీఈడీ కాలేజీకి రెగ్యులర్ ప్రిన్సిపాల్ లేరు. ఇదే కాలేజీలో లెక్చరర్ అయిన అబ్దుల్‌హై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్నారు. అంతటితో సరిపోదన్నట్టు హనుమండ జిల్లా ఇన్‌చార్జి డీఈవోగా కూడా అదనపు బాధ్యతలను అప్పగించారు.

కొరవడిన పర్యవేక్షణ

ఇన్‌చార్జి డీఈవోలు, ఎంఈవోల కారణంగా ప్రభుత్వ పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడింది. దీంతో ఉపాధ్యాయులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సమయ పాలన పాటించకపోవడం, తర్వాత పాఠశాలలకు వచ్చాక సంతకాలు పెట్టడం, విధి నిర్వహణ సమయంలో వ్యక్తిగత పనులపై బయట తిరగడం, ఉపాధ్యాయుల మధ్య విభేదాలు వంటివి చోటుచేసుకుంటున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఉపాధ్యాయులతో బోధనేతర పనులు చేయించొద్దని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నా కొందరు ఇన్‌చార్జి ఎంఈవోలు పనిభారం పేరుతో పలువురు ఉపాధ్యాయులను ఆఫీసు పనుల కోసం కార్యాలయాలకు రప్పించుకుంటున్నారని తెలుస్తోంది. ఇదే అలుసుగా మరికొందరు ఉపాధ్యాయులు ఆఫీసు పని పేరు చెప్పుకొని సొంత పనులు చేసుకుంటున్నారని సమాచారం. దీంతో విద్యార్థులకు బోధన సరిగా అందడం లేదు. డీఈవోలు, ఎంఈవోలు అంతా ఇన్‌చార్జిలు కావడంతో విధుల నిర్వహణలో జవాబుదారీతనం కొరవడుతోంది. ఒకటికన్నా మించి అదనపు బాధ్యతలను అప్పగించడంవల్ల వారు దేనికీ న్యాయం చేయలేకపోతున్నారు. ఫలితంగా పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడుతోంది. విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయి.

మూడోరోజు మేడారం హుండీల లెక్కింపు

ఆదాయం రూ 3.46 కోట్లు



హనుమకొండ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని టీటీడీ కళ్యాణ మండపంలో మేడారం హుండీల లెక్కింపు కొనసాగుతోంది. శనివారం మూడోరోజు 112 హుండీలను లెక్కించగా రూ 3,46,61,000 ఆదాయం సమకూరినట్టు మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ఈవో రాజేంద్రం తెలిపారు. దీంతో మూడు రోజులుగా నిర్వహించిన హుండీ లెక్కింపుతో మొత్తం రూ.9,60,36,000 సమకూరింది. మొత్తం 317 హుండీలను లెక్కిం చడం పూర్తయింది. మొదటి రోజు రూ.3,15,40,000, రెండోరోజు రూ. 2,98,35,000 కోట్లు ఆదాయం సమకూరింది. ఇంకా 201 హుండీలను లెక్కిం చాల్సి ఉంది. వచ్చే రెండు రోజుల్లో వీటిని లెక్కించడం పూర్తి చేస్తారు. మేడారం జాతరలో మొత్తం 518 హుండీలను ఏర్పాటు చేశారు. వీటిలో ఇనుప హుండీలు 482, క్లాత్ హుండీలు 34, బియ్యం హుండీలు. లెక్కించిన హుండీ ఆదాయాన్ని వెంట వెంటనే బ్యాంకులో జమ చేస్తున్నారు. హుండీల్లో ఇండియన్ కరెన్సీతో పాటు విదేశీ కరెన్సీ పెద్ద మొత్తంలో బయటపడుతోంది. దీనితో పాటు వెండి, బంగారు కానుకలు కూడా కంటపడుతున్నాయి. నాణాలు, బియ్యం పెద్దమొత్తంలో పోగవుతున్నాయి. నాణాలను చివరి రోజున తూకం వేయడం ద్వారా లెక్కిస్తారు. బియ్యాన్ని బస్తాల్లో నింపు నిలువ చేస్తున్నారు. లెక్కింపు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక యంత్రం వల్ల హుండీల లెక్కింపు త్వరితగతిన సాగుతోంది.

జీపీ భవనాలకు శంకుస్థాపన



చౌడూరులో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

దేవరుప్పుల, మార్చి 2: మండలంలోని పలు గ్రామాలలో నూతన జీపీ భవనాల నిర్మాణానికి పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. రాంచంద్రాపురం, చౌడూరు, రంభోజీగూడెం గ్రామాలలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం నుంచి ఒక్కో పంచాయతీకి రూ. 20లక్షల నిధులు మంజూరు కాగా ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బస్వ సావిత్రి, ఎంపీటీసీ ఆశాజ్యోతి, ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎంపీవో సురేష్‌కుమార్, పీఆర్‌ఈఈ చంద్రశేఖర్, డిప్యూటీ ఈఈ రామలింగాచారి, ఏఈ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షుడు పెడ్డి కృష్ణమూర్తి, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు నల్ల శ్రీరామ్, సోమనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

పంటలు ఎండిపోతున్నాయని రైతుల మొర..

వరిపంటలు ఎండిపోతున్నాయని, గోదావరి జలాలు వదిలి ఆదుకోవాలని ఎమ్మెల్యే యశస్వినీరెడ్డికి రంభోజీగూడెంలో రైతులు మొరపెట్టుకున్నారు. జీపీ భవన శంకుస్థాపన ముగిసాక చిప్పరాళ్లబండ, తదితర తండాలతో పాటు గ్రామాల రైతులు ఆమెకు విన్నవించుకున్నారు. దీంతో ఆమె స్పందించి ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. రెండు, మూడు రోజుల్లో నీరు వచ్చే విధంగా కృషి చేస్తానని చెరువులు, కుంటలు, నింపే ప్రయత్నం చేస్తానని అన్నారు.

గృహజ్యోతి పథకం ప్రారంభం..

పాలకుర్తి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకాన్ని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, ప్రభుత్వ విప్ రాంచంద్రు నాయక్ శనివారం ప్రారంభించారు. పాలకుర్తిలో వినియోగదారులకు జీరో బిల్లు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గృహజ్యోతి పథకం కింద నెలకు రూ. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ వేణుమాధవ్, ఎస్ఏవో జయరాజ్, డీఈ హుస్సేన్, ఏఈలు తిలక్, రణధీర్ పాల్గొన్నారు.

మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి



కలెక్టరేట్‌లో నివాళి అర్పిస్తున్న అడిషనల్ కలెక్టర్ పింకేశ్‌కుమార్

జనగామ టౌన్, మార్చి 2: ఉమ్మడి ఏపీ మాజీ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాదరావు జయంతిని శనివారం అధికారికంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి అడిషనల్ కలెక్టర్ పింకేశ్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను గుర్తించి ఎల్లంపల్లి, సుజల స్రవంతి ప్రాజెక్టులకు ఆయన పేరు పెట్టారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఆర్డీవో కొమురయ్య, కలెక్టరేట్ ఏవో రవీందర్, వివిధ శాఖల జిల్లా అధికారులు వినోద్‌కుమార్, రోజారాణి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్యాలయంలో..

జనగామ మునిసిపల్ కార్యాలయంలో మాజీ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాదరావు జయంతిని నిర్వహిచారు. మునిసిపల్ ఛైర్‌పర్సన్ పోకల జమున ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

జఫర్‌గడ్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి కార్యక్రమాన్ని శనివారం జఫర్‌గడ్ తహసిల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. శ్రీపాదరావు చిత్ర పటానికి తహసిల్దార్ అంబటి ఆంజనేయులు, డిప్యూటీ తహసిల్దార్ బాసెట్టి హరిప్రసాద్, ఎంఆర్ఐ అనిల్‌కుమార్, తదితర రెవెన్యూ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు.

అదిరేటీ..రుచులు

రిలీఫ్‌కు కేరాఫ్‌గా కేఫ్‌లు

స్నేహితులు కలిస్తే తేనీటికే మొగ్గు

రకరకాల రుచులతో ఆకట్టుకుంటున్న వ్యాపారులు

లింగాలఘణపురం, మార్చి2: తెల్లవారింది మొదలు రాత్రి పొద్దుపోయే వరకు తీరిక లేని నేటి పరిస్థితుల్లో కాస్త విరామం దొరికితే టక్కున గుర్తొచ్చేది గరం గరం చాయ్.. నిద్రలేచి కాలు నేలపై మోపక ముందే గొంతులో ఓ కప్పు కాఫీ, తేనీరు పడనిదే శరీరం స్వాధీనంలోకి రాదంటే అతిశయోక్తి కాదు. టీ కాఫీలతో పాటుగా లెక్కకు మించిన వెరైటీ రుచులతో తేనీరు అదరహో అనిపిస్తోంది. ఈ చాయ్‌లలో ఇప్పుడు అనేక రకాల రుచులు అందరి మదిని దోచేస్తున్నాయి. పలు రకాల తేనీటి ప్రత్యేకతలపై ఆదివారం కథనం.

అల్లం టీ..

ఉదయాన్నే అల్లం టీ తాగి తే ఆ రోజంతా





మనసు హుషారుగా ఉంటుంది. అల్లం టీ తాగడం వల్ల చాతిలో మంట, అజీర్ణం వంటి సమస్యలకు చెక్‌పెట్టినట్టు ఉంటుందని వైద్యనిపుణులు సూచిస్తున్నా రు. అల్లం టీలో యాంటీ యాక్సిడెంట్లు ఉండటం వల్ల రోజూ ఒక కప్పు అల్లం టీ తీసుకుంటే జీర్ణవ్యవస్థ సక్రమంగా ఉంటుందని పేర్కొంటున్నారు.

లెమన్ టీ..

నిమ్మకాయ పేరు చెబితేనే ఒంటిలో ఉన్న జబ్బులు జంకిపోతాయి. అలాంటిది నేరుగా నిమ్మకాయతో కూడి న చాయ్‌ని తాగితే ఇంకా ఎలా ఉంటుందో ఊహించుకుంటేనే వావ్ అనిపిస్తోంది. లెమన్‌టీ తీసుకోవడం వల్ల అనేక రకాల ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు పేర్కొంటున్నారు. శరీరంలో జీవక్రియలను మెరుగు పర్చేందుకు దోహదపడుతోంది. ఒత్తిడిలో ఉన్నప్పుడు లెమన్‌టీ తాగితే మరుక్షణమే రిలాక్స్ లభిస్తుంది.

గ్రీన్ టీ..

రుచితో పాటుగా పలురకాలుగా మెరుగైన ఆరోగ్యానికి గ్రీన్ టీ దోహద పడుతుంది. రక్తంలో షుగర్ లెవల్స్‌ను నిర్దిష్టంగా ఉంచుతుంది. గ్రీన్ టీ తీసుకోవడం వల్ల మెదడులో చురుకుదనం పెరుగుతుందనే నమ్మకం కూడా తాగిన వారిలో ఉంది. కేన్సర్ కారకాలను వ్యతిరేకించే గుణం గ్రీన్ టీ ప్రత్యే కం. కీళ్ల నొప్పుల నివారణతో పాటుగా రోగనిరోధక శక్తిని పెంచుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

బ్లాక్ టీ..

బ్లాక్ టీ తాగడం వల్ల మధుమేహం నియంత్రణలో ఉంటుందని పరిశోధకులు అంచనా వేస్తున్నారు. బ్లాక్‌టీలో కేఫిన్ ఎక్కువగా ఉంటుంది. ఇది ఇతర టీలతో పోల్చుకుంటే టీ వాసన అధికంగా ఉంటుంది. ఈ టీ తాగడం వల్ల గుండె సంబంధిత సమస్యలు తగ్గుతాయని, ఎముకలు బలపడుతాయని, శరీరంపై ఉండే మచ్చలు తొలగిపోయే అవకాశం ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు.

రిలీఫ్‌కు కేరాఫ్‌గా..

ప్రస్తుత బిజీ జీవితంలో మనిషికి కేఫ్‌లు కాస్త రిలీఫ్ ఇస్తున్నాయి. పని ఒత్తిడితో వేడెక్కిన మెదడును చల్లార్చేందుకు ఒకే మార్గం కేఫ్ దారిపట్టడం. అక్కడ ఓ కప్పు టీ తాగామంటే ఇక ఉత్సా హం రెట్టింపవుతుంది. వీలైతే నాలు గు ముచ్చట్లు పెట్టామంటే ఇక మైండ్ రీఫ్రెష్ అయినం త హుషారుగా మళ్లీ విధుల్లో చేరి చకచకా పనులను సాగించేస్తారు.

నలుగురు పోగైతే దారులు అటువైపే..

పొద్దున లేచింది మొదలు సాయంత్రం ఇంటికొచ్చే దాకా ఎవరి పనులు వారివే.. సరదాగా కూర్చుని ముచ్చట పెట్టే రోజులకు కాలం చెల్లిపోయింది. దీంతో గ్రామీణ ప్రాంతాలైనా.. పట్టణ ప్రాంతాలైనా నలుగురు తారసపడితే ఇక నేరుగా టీ స్టాల్‌కు, కేఫ్ సెంటర్లకు పయనం కట్టడం సాధరణమైంది.

తేనీరు మనసుకు, శరీరానికి ఉత్తేజాన్నిస్తుంది..



- రేగు సంపత్, బ్యాంక్ ఉద్యోగి, వడ్డిచర్ల

ఉరుకుల పరుగుల జీవితం సర్వసాధారణంగా మారిపోయిన నేటి పరిస్థితుల్లో తేనీరు మానసిక, శారీరక ఉత్తేజాన్ని కలిగిస్తోంది. పొద్దున లేవగానే కాస్త టీ తాగామంటే మనసు కుదుటపడుతుంది. మార్నింగ్ వాక్.. ఈవినింగ్ వాక్ వెళ్లిన తర్వాత టీ తాగితే ఎంతో హాయిగా అనిపిస్తుంది. లెమన్‌టీ లాంటి ద్రావకాలు ఆరోగ్యానికి దోహదపడుతాయి.

చాయ్‌తో మనసుకు ఉల్లాసం..



-మాధంశెట్టి సతీష్‌కుమార్ వస్త్రవ్యాపారి, జనగామ

పొద్దున లేవగానే చాయ్ తాగాలనే కుతూహలం నన్ను వెంటాడుతుంది. సమస్యలు ఎన్ని ఉన్నా ఒక్క చాయ్ తాగితే కొంత మనసు కుదుటపడుతుంది. కొత్త ఆలోచనలు మనసులో స్ఫురిస్తాయి. లెమన్ టీ తాగడం వల్ల ఆరోగ్యం కూడా బాగుంటుంది.

'కమలం'లో వీడని ఉత్కంఠ

- తొలిజాబితాలో ఓరుగల్లుకు దక్కని చోటు
- పార్లమెంట్ ఆశావహుల్లో టెన్షన్

వరంగల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ త్వరలోనే వస్తుందన్న వార్తల నేపథ్యంలో బీజేపీ శనివారం తన అభ్యర్థుల తొలిజాబితాను విడుదల చేసింది. అందులో వరంగల్, మహబూబాబాద్ ఎంపీ స్థానాలకు అభ్యర్థులను ఖరార చేయకపోవడంతో కమలం టికెట్ ఆశిస్తున్న నేతల్లో ఉత్కంఠ పెరుగుతోంది. దేశవ్యాప్తంగా 195మంది మందితో జాబితాను ప్రకటించగా.. అందులో రాష్ట్రంలో 9స్థానాలకు అభ్యర్థుల పేర్లను వెల్లడించింది. అయితే ఉమ్మడి వరంగల్‌లోని రెండు స్థానాలను పెండింగ్‌లో పెట్టడంతో టికెట్ ఎవరికి అనే చర్చ జరుగుతుంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ నుంచి వచ్చే నేతల కోసమే పెండింగ్‌లో పెట్టారా? లేదంటే రాజకీయ, కుల సమీకరణల కోసం జాబితాలో చోటు దక్కలేదా అనేది చర్చనీయాంశంగా మారింది.

తొలి విడతలో నిరాశే..

తొలిజాబితాలో రాష్ట్రంలోని ముగ్గురు సిట్టింగ్ ఎంపీలతో పాటు మరో ఆరుగురికి కొత్తగా అవకాశం కల్పించిన అధిష్ఠానం వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించలేదు. ఇప్పటికే వరంగల్ ఎంపీ స్థానం నుంచి డజను మందికి పైగా నేతలు టికెట్ రేసులో ఉన్నారు. అయితే ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణమాదిగను వరంగల్ నుంచి పోటీ చేయించాలని సూచించినట్లు ప్రచారం జరిగింది. అయితే ఎన్నికల్లో పోటీకి మంద కృష్ణ సుముఖంగా లేరని, మాజీ పోలీసు అధికారి కృష్ణప్రసాద్ పోటీ చేయబోతున్నారని ప్రచారం జరిగింది. వీరితో పాటు కీలకమైన నేతలు పలువురు టికెట్ కోసం అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారు. తొలి విడతలోనే వరంగల్ పార్లమెంట్‌పై అధిష్ఠానం తేలుస్తుందని భావించినా కాషాయ నేతలకు నిరాశే మిగిల్చింది. అలాగే మానుకోట అభ్యర్థిని కూడా బీజేపీ పెండింగ్‌లో పెట్టింది. బీజేపీ రాష్ట్ర నాయకులు హుస్సేన్‌నాయక్, యాప సీతయ్యల్లో ఒకరికి టికెట్ ఖాయంగా బీజేపీ శ్రేణులు భావించాయి. రాష్ట్రంలో ఆదిలాబాద్, మహబూబాబాద్ ఎంపీ సీట్లే ఎస్టీలకు రిజర్వు అయ్యాయి. ఆదిలాబాద్ నుంచి ఆదివాసీలకు టికెట్ ఇస్తే, మహబూబాబాద్‌లో లంబాడా సామాజిక వర్గం నుంచి టికెట్ ఇస్తారనే చర్చ జరిగింది. అయితే ఆదిలాబాద్ బీజేపీ సిట్టింగ్ స్థానమైనప్పటికి తొలిజాబితాలో అభ్యర్థిని ప్రకటించలేదు. దీంతో ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి తెలితేనే మహబూబాబాద్ సీటుపై ఎవరికి అనేది స్పష్టత వస్తుందని బీజేపీ శ్రేణులు భావిస్తున్నాయి.

ప్యారాచూట్ నేతల కోసమేనా..?

తొలి జాబితాలో వరంగల్, మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థులను బీజేపీ ప్రకటించకపోవడానికి మరో కారణం కూడా ఉందన్న చర్చ జరుగుతోంది. ఇటీవల బీజేపీలో చేరిన బీఆర్ఎస్‌కు చెందిన జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్‌కు, నాగర్‌కర్నూలు ఎంపీ రాములు కుమారుడు భరత్‌కు సీట్లు ఖరారయయ్యాయి. దీంతో వరంగల్ నుంచి పోటీ చేయాలని బీఆర్ఎస్‌కు చెందిన ఓ మాజీ ఎమ్మెల్యేపై బీజేపీ నేతలు ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. బీఆర్ఎస్‌ను వీడిన తరువాత బీజేపీలో టికెట్ ఇవ్వకపోతే ఏలా అనే ప్రశ్నలు ఆ మాజీ ఎమ్మెల్యే నుంచి బీజేపీ నేతలకు ఎదరయ్యాయి. దీంతో పార్టీలో చేరిన వారికి అధిష్ఠానం టికెట్ ఇచ్చిందని.. జహీరాబాద్, నాగూర్‌కర్నూలు ఉదాంతాన్ని చూపెడుతూ.. ఓ బీఆర్ఎస్ నేతను బీజేపీలో చేర్చుకుని టికెట్ ఇస్తారనే ప్రచారం కూడా జరుగుతుంది. అలాగే మానుకోట నుంచి కూడా ఓ మాజీ ఎంపీతో పాటు కాంగ్రెస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే కూడా గోడ దూకేందుకు సిద్ధంగా ఉన్నారనే ప్రచారం ఉంది. వీరితో చర్చలు చివరి దశలో ఉండటంతో తొలి జాబితాలో అభ్యర్థిని ఖరారు చేయలేదని సమాచారం. మొత్తానికి ప్యారాచూట్ నేతల కోసం అధిష్ఠానం ఎదురుచూస్తుందనే ప్రచారంతో టికెట్ కోసం ఎన్నో ఆశలతో ఉన్న నేతల్లో ఉత్కంఠ నెలకొంది.

గ్రామదేవతలకు ఘనంగా బోనాలు

నర్మెట, మార్చి 2 : మండలంలోని ఇప్పలగడ్డ గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవాలలో భాగంగా శనివారం గ్రామ దేవతలు పెద్దమ్మ, పోచమ్మ, దుర్గమ్మకు బోనాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. డప్పు చప్పుల్లతో బోనాలతో వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు నైవేద్యాన్ని సమర్పించారు. తమ కుటుంబాలు సుఖ సంతోషాలతో ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని మొక్కుకున్నారు. శివసత్తులకు పూనకాలు రావడంతో తల్లీ శరణు శరణు అంటూ భక్తులు వేడుకున్నారు. ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి వనభోజనాలకు వెళ్లనున్నట్లు మాజీ సర్పంచ్ నీరటి రాణి సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో కుల పెద్దలు పాల్గొన్నారు.

మద్యం మత్తులో డ్రైవర్ బీభత్సం

- కుందారంలో యువకుడిని ఢీకొట్టిన డీసీఎం
- కిష్టగూడెంలో బారికేడ్ల ధ్వంసం
- చీటూరులో దేహశుద్ధి చేసిన గ్రామస్థులు

లింగాలఘణపురం, మార్చి2: మద్యం మత్తులో ఓ డ్రైవర్ బీభత్సం సృష్టించాడు. డీసీఎం నడుపుతూ మనుషలను, బారికేడ్లను ఢీకొట్టుకుంటూ వెళ్లాడు. చివరకు గ్రామస్థులు పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకెళితే.. లింగాలఘణపురం మండలం కుందారం గ్రామానికి చెందిన కోతి రాజు అనే యువకుడు పాలకేంద్రం వద్ద పాలు తీసుకుని రోడ్డుదాటుతుండగా అదే సమయంలో అటుగా జనగామ నుంచి పెద్దతండాకు వెళ్తున్న డీసీఎం బలంగా ఢీకొట్టింది. ఈసంఘటనతో స్థానికులు భయాందోళనకు గురై డీసీఎంను ఆపమని అరుపులు కేకలు పెట్టినా కూడా స్పందించని డ్రైవర్ గుగులోత్ రవి అదే వేగంతో వెళ్లి కిష్టగూడెంలో ఉన్న బారికేడ్లను ఢీకొట్టాడు. దీంతో అప్రమత్తమైన స్థానికులు డీసీఎంను వెంబడించి చీటూరులో అదుపులోకి తీసుకుని డ్రైవర్ రవికి దేహశుద్ధి చేశారు. పోలీసులు రంగప్రవేశం అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. కాగా, ఈ విషయమై బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై రాజు తెలిపారు. బాధితుడిని చికిత్స నిమిత్తం జనగామకు తరలించారు.

పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ

కొడకండ్ల మార్చి 2: ఈ నెల 3న ఆదివారం రోజున పోలియో దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలో శనివారం వైద్యశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి హరికృష్ణ మాట్లాడుతూ దేశాన్ని పోలియో రహిత దేశంగా మార్చాలంటే ప్రతీ ఒక్కరు ఆదివారం రోజున పుట్టిన బిడ్డ నుంచి 5 వ సంవత్సరాల చిన్నారులకు రెండు పోలియో చుక్కలను తప్పనిసరి వేయించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కాలనీ పాఠశాల హెచ్‌ఎం దోర్నం ప్రభాకర్, ఉపాధ్యాయులు కుసుమ రాజు, సీహెచ్‌వో దయాకర్, సూపర్‌వైజర్ రమేశ్, ఏఎన్‌ఎంలు లలిత, మంజుల, శారద, యాకమ్మ పాల్గొన్నారు.

ఎవరీ దొంగలు?

వరుసగా మాయమవుతున్న కేబుల్ వైర్లు

పట్టించుకోని పోలీసులు ● ఆందోళనలో రైతులు

బచ్చన్నపేట, మార్చి 2: బచ్చన్నపేట మండలంలో వ్యవసాయ బావుల వద్ద కేబుల్ వైర్లు ఎత్తుకెళుతున్న ముఠా పోలీసులకు సవాళ్లు విసురుతూనే ఉంది. తాజాగా శనివారం రాత్రి చిన్నరామన్‌చర్ల గ్రామ పరిధిలోని వ్యవసాయ బావుల వద్ద కేబుల్ (కాపర్) వైర్లను మళ్లీ ఎత్తుకెళ్లారు. దీంతో బాధిత రైతులు పుర్మ శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మారెడ్డి, సంజీవరెడ్డి, పుల్లయ్య, నర్సిరెడ్డి, తిరుపతి రెడ్డి, బొట్టు సుధాకర్, నరేందర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అసలే బోర్లు ఎత్తిపోవటంతో పొలాలకు వరుస తడులు అందిస్తూ పారిస్తున్నామని, మరోవైపు వైర్లు ఎత్తుకెళ్తే పొలాలు ఎండే పరిస్థితి వచ్చిందని అన్నారు. నెల రోజులుగా మండలంలో ఇదే తంతు కొనసాగుతోందని, పోచన్నపేట, బచ్చన్నపేట, చిన్నరామన్‌చర్ల గ్రామాల్లో ఇలా వరుసబెడుతూ వ్యవసాయ భూముల వద్ద కేబుల్ వైర్లు కత్తిరించుకు వెళుతున్నారని, కొత్త వైరు బిగించాలంటే రూ. 10 వేలకు పైగా ఖర్చు అవుతుందని గోడు వెళ్లబోసుకుంటున్నారు. పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి దొంగల ఆట కట్టించాలంటూ రైతులు వేడుకుంటున్నారు.

ధరణి సమస్యలపై దృష్టి సారించండి

- అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్



స్టేషన్‌ఘన్‌పూర్‌లో సిబ్బందికి సూచనలు ఇస్తున్న అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్



జఫర్‌గడ్ తహసిల్దార్ కార్యాలయంలో ధరణి దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీవో వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 2: ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి పరిపరిష్కరించాలని అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఘన్‌పూర్ మండలపరిధిలో 197 పెండింగ్ దరఖాస్తులు ఉండగా అందులో కలెక్టర్ మాడ్యూల్‌లో పరిష్కరించబడేవి 93 దరఖాస్తులు, ఆర్డీవో మాడ్యూల్‌లో 72 దరఖాస్తులు, తహసీల్దార్ మాడ్యూల్‌లో 31 దరఖాస్తులు, సీసీఎల్ఏ పరిధిలో 1 దరఖాస్తు పరిష్కరించేలా ఉన్నాయని తెలిపారు. 197 దరఖాస్తులను పరిష్కరించడానికి గాను ఘన్‌పూర్ పరిధిలో మూడు టీఎంలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో డిఎస్ వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, టీడీ విజయ్‌కుమార్, ఆర్ఐలు అర్జున్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన పరిష్కరించాలి: ఆర్డీవో వెంకన్న

జఫర్‌గడ్/చిలుపూర్: ధరణి సమస్యలను వెంటనే పరిష్కరించాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో డీఎస్.వెంకన్న రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన జఫర్‌గడ్, చిలుపూర్ తహసిల్దార్ కార్యాలయాలను సందర్శించి ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు మండలాల్లో ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను ఈనెల 9వ తేదీ లోపు పరిష్కరించాలన్నారు. ఇందుకు సంబంధించిన నివేదికలను ఎప్పటికప్పుడు తనకు పంపించాలన్నారు. అనంతరం చిలుపూర్‌గుట్ట బుగులు వెంకటేశ్వర స్వామివారి ఆల యంలో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు పాల్గొన్నారు.

దుర్వినియోగం చేసిన నిధులను రికవరీ చేయాలి

కంచనపల్లి సొసైటీలో ఏకగ్రీవ తీర్మానం



సభలో మాట్లాడుతున్న పీఏసీఎస్ ఛైర్మన్ రవీందర్

రఘునాథపల్లి, మార్చి 2: కంచనపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో దుర్వినియోగం చేసిన నిధులను రికవరీ చేయాలని మహాజన సభ ఏకగ్రీవంగా తీర్మానించింది. స్థానిక పీఏసీఎస్ ఆవరణలో శనివారం జరిగిన మహాజన సభకు సొసైటీ ఛైర్మన్ చీమలపాటి రవీందర్ అధ్యక్షత వహించారు. సొసైటీకి సంబంధించిన ఆర్థిక లావాదేవిలలో జరిగిన విచారణలో సెక్షన్ 51 ప్రకారం నివేదికను సమర్పించారు. దుర్వినియోగానికి గురైన డబ్బులను రికవరీ చేయడంతో పాటు అవకతవకలకు పాల్పడిన డైరెక్టర్లు, అధికారులపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని, సొసైటీ మాజీ ఉద్యోగి పున్నంరావుకు చెల్లించాల్సిన జీత భత్యాలను ఇవ్వాలని, సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే రేషన్ షాపునకు సంబంధించిన ఆడిటర్‌పై శాఖ పరంగా చర్యలు తీసుకోవాలని, సస్పెన్షన్‌కు గురైన సీఈవో వంగ శ్రీనివాస్ సొంతానికి వాడుకున్న ఎరువుల డబ్బులు రూ.13లక్షల 35 వేలను వెంటనే రికవరీ చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ రవీందర్ మాట్లాడుతూ నిధులు వాడుకున్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సీఈవో ప్రశాంత్, పీఏసీఎస్ డైరెక్టర్లు అయితా జయరాములు, జిట్టే వీరస్వామి, దామోదర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, రవి, భాస్కర్, విజయ, ధర్మ, సౌందర్య, సభ్యులు రాపోలు రామ్మూర్తి, కొంరెల్లి, భాస్కర్ రెడ్డి, మనోహర్ పాల్గొన్నారు.

రాజయ్యను కాంగ్రెస్‌లోకి రానివ్వం

- యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కీసర దిలీప్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కీసర దిలీప్ రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 2: మాజీ ఎమ్మెల్యే రాజయ్యను కాంగ్రెస్ పార్టీలోకి రానివ్వబోమని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కీసర దిలీప్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఆయన స్టేషన్‌ఘన్‌పూర్‌లో మాట్లాడుతూ రాజయ్య కాంగ్రెస్‌లోకి వస్తే తమ భర్తలు తమను రాజకీయాలు చేయనీయరని మహిళ నాయకులు గాంధి భవన్‌కు వెళ్లి ధర్నా చేశారని, అయనప్పటికీ ఆయన పార్టీలోకి రావాలని చూడడం సిగ్గుచేటని మండిపడ్డారు. అధిష్ఠానం రాజయ్యను కాంగ్రెస్‌లోకి తీసుకుంటే యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ విషయంలో సంతకాల సేకరణ చేసి సీఎం రేవంత్ రెడ్డికి పంపిస్తామని అన్నారు. రాజయ్య కాంగ్రెస్‌లోకి వస్తే అయన చెంచాలు, కమీషన్ ఏజెంట్లు పార్టీని కలుషితం చేస్తారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బస్వగాని అనిల్‌గౌడ్, ఐలపాక శ్రీనివాస్, చిటకూరి సంపత్, గొల్లూరి పృథ్వీ, రడపాక డానియల్, మారపాక వసంత్, గుండె మల్లేషం, నలిమెల ఏలియా, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విజయం



సిలిండర్‌కు పూలమాల వేసిన కాంగ్రెస్ నాయకులు

బచ్చన్నపేట, మార్చి 2: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చటంతో సంపూర్ణ విజయం దిశగా అడుగులు వేస్తోందని కాంగ్రెస్ పార్టీ బచ్చన్నపేట పట్టణ అధ్యక్షులు కోడూరు మహాత్మాచారి అన్నారు. శనివారం మండల కేంద్రంలో రూ.500కే ప్రభుత్వం గ్యాస్ సిలండర్ అందిస్తున్న దృష్ట్యా ఉత్సవాలు నిర్వహించారు. గ్యాస్ మొద్దుకు పూలదండలు వేసి మిఠాయిలు పంచుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ ఇచ్చిన మాటకు కట్టుబడి ఆరు గ్యారంటీలను అమలు చేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంచటం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, రూ.500లకే గ్యాస్ సిలండర్ తదితర నాలుగు హామీలను ఇప్పటికే ప్రారంభించిందని గుర్తు చేశారు. మరో రెండు హామీలకు కొద్ది రోజుల్లో శ్రీకారం చుట్టనున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు నల్లగోని బాలకిషన్‌గౌడ్, అల్వాల ఎల్లయ్య, దాచేపల్లి నర్సింగరావు, చెరుకూరి శ్రీనివాస్, దిడిగ రమేశ్, వెంకటేశ్వర్లు, కిష్టయ్య, కర్రె నరేష్, బుచ్చిరాజు, రాజయ్య, హరీష్, మధుసూదన్‌రెడ్డి, సందెల రాము, నర్సిరెడ్డి, సుధాకర్, సత్యనారాయణ, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

కమినరేట్ పరిధిలో ఏసీపీల బదిలీ

ఉత్తర్వులు జారీ చేసిన డీజీపీ

హనుమకొండ క్రైం, మార్చి 2: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఐదుగురు ఏసీపీలకు బదిలీ చేస్తూ డీజీపీ రవిగుప్తా శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 45 మందికి స్థానచలనం కాగా కమిషనరేట్ పరిధిలో ఐదుగురు బదిలీ అయ్యారు. బదిలీ, పోస్టింగ్ పొందిన వారు ఒకటి, రెండు రోజుల్లో విధుల్లో చేరాలని డీజీపీ ఆదేశాలు జారీ చేశారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ ఐన ప్రదేశం
ఎస్. శ్రీనివాస్	స్టేషన్ ఘన్‌పూర్	డీజీపీ అటాచ్
సి. సతీష్‌బాబు	మామునూరు	డీజీపీ అటాచ్
ఆర్. భీంశర్మ	సిరిసిల్ల	స్టేషన్ ఘన్‌పూర్
బి. తిరుపతి	ఇంటలీజెన్స్	మామునూరు
బి. మల్లయ్య	సీసీఎస్ వరంగల్	డీజీపీ అటాచ్

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

జనగామ కల్చరల్, మార్చి 2: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. గతంలో టెన్త్ క్లాస్ పరీక్షా పేపర్ల లీకేజీ సంఘటనలు పునరావృతం కాకుండా సీఎస్ శాంతికుమారి ఆదేశాల మేరకు జిల్లా లోని ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద భద్రతను మరింత పటిష్ఠం చేశారు. ఇప్పటికే పరీక్షల నిర్వహణ అధికారులకు కూడా మొబైల్ ఫోన్లు అనుమతి లేకపోగా ప్రస్తుతం స్విచ్ ఆఫ్ చేసి కూడా పరీక్షా కేంద్రంలో పెట్టవద్దని ఆంక్షలు విధించారు. అభ్యర్థులు తెచ్చే వాహనాలు కూడా పరీక్షా కేంద్రానికి దూరంగా పార్కింగ్ చేయించాలని పోలీసులకు ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. కాగా ఆదిలాబాద్ లో విద్యార్థి ఆత్మహత్య నేపథ్యంలో ఒక్క నిమిషం నిబంధనను అధికారులు 5 నిమిషాలకు సడలించారు.


జిల్లాలో 97.37% విద్యార్థుల హాజరు ..

ఇంటర్మీడియట్ సెకండీయర్ విద్యార్థులకు శనివారం ఇంగ్లీషు పరీక్ష జరిగింది. 4187 మంది విద్యార్థులకు గాను 110 మంది గైర్హాజరు కాగా 4077 మంది (97.37%) విద్యార్థులు హాజరయ్యారు. నర్మెట, జనగామలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, ముస్లిం మైనారిటీ స్కూల్ పరీక్షా కేంద్రాలను డీఐఈఓ బైరి శ్రీనివాస్, జఫర్‌గడ్, పాలకుర్తి, టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ పరీక్షా కేంద్రాలను డెక్ సభ్యులు, కొడకండ్ల, దేవరుప్పుల పరీక్షా కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు సందర్శించాయి. జఫర్‌గడ్‌లో రెండు మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయి.

దుర్గామాత ఆలయానికి రూ.21వేల విరాళం

బచ్చన్నపేట, మార్చి 2: మండలంలోని బండనాగారం గ్రామంలో నిర్మిస్తున్న దుర్గామాత ఆలయ నిర్మాణానికి బచ్చన్నపేటకు చెందిన బీఆర్ఎస్ నేత కొండి వెంకట్‌రెడ్డి రూ.21 వేలు విరాళంగా అందించారు. ఇప్పటికే ఆయన మండలంలోని పలు ఆలయాల నిర్మాణాలకు విరాళాలు అందించారు. ఆయన వెంట నాయకులు కొప్పురపు శ్రీనివాస్‌రెడ్డి, శివరాత్రి రాజనర్సయ్య, గౌరారం కనకయ్య, నిమ్మ కరుణాకర్‌రెడ్డి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



అశ్విని (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 2: మండలంలోని మీదికొండ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందారు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మీదికొండ గ్రామానికి చెందిన చిదురాల అశ్విని (30) తన భర్త రాజేందర్, కుమార్తెతో కలిసి బైక్‌పై పాలకుర్తికి బంధువుల వివాహ వేడుకకు వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో గ్రామం సమీపంలోని ఫంక్షన్‌హాల్ ఎదుట ఎదురుగా వచ్చిన మరో బైక్ వీరిని ఢీకొట్టింది. దీంతో అశ్విని రోడ్డు పైన ఎగిరిపడడంతో తలకు బలమైన గాయమై అపస్మారకస్థితిలోకి వెళ్లింది. స్థానికులు వెంటనే ఆమెను హన్మకొండలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అక్కడినుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రమాదంలో మృతురాలి భర్త రాజేందర్, ఆమె కుమార్తె, మరో బైక్ నడుతుపున్న వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎస్సై నాగరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.